


మిల్లర్లకు ముకుతాడు!





హనుమకొండ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొందరు మిల్లర్లు సీఎంఆర్‌ను పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి బాకీ పడిన బియ్యాన్ని ఇవ్వకుండా వారి పరపతితో తప్పించుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రభు త్వం మారడంతో పౌరసరఫరాల శాఖలో లొసుగులను వెలికితీస్తోంది. గత ప్రభుత్వం హయాంలో బాకీపడిన సీఎంఆర్ మొత్తాన్ని వసూలు చేయడానికి అధికా రులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2022-23వ వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించి దిగుబడి అయిన బియ్యాన్ని మిల్లింగ్ కోసం మిల్లర్లకు కేటాయించగా ఇందులో వానాకాలం సీజన్‌కు సంబంధించి 94 శాతం వరకు బియ్యం రాగా, యాసంగి సీజన్‌లో మిల్లింగ్ 24 శాతం పూర్తయింది. మిల్లర్ల నుంచి పెద్ద మొత్తంలో బియ్యం రావలసి ఉంది. వాటి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు నాలుగు సార్లు గడువు పొడిగించింది. అయినా స్పందనలేకపోవడంతో కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాలోని రైస్ మిల్లులను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో కొందరు మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ప్రభు త్వానికి ఇవ్వకుండా దారి మళ్లించినట్టు వెల్లడవుతోంది. దీంతో అక్రమాలకు పాల్పడిన మిల్లలను సీజ్ చేసి మిల్లర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. కొందరు మిల్లర్ల ఆస్తులను కూడా జప్తు చేసి వేలం కూడా వేస్తున్నారు.

కొత్త నిబంధనలు

మిల్లర్లు బాకీ పడిన మొత్తానికి 25 శాతం అదనంగా కలిపి ప్రభుత్వానికి బియ్యం అందజేయాలి. లేకపోతే క్రిమినల్ కేసులతో పాటు ఆర్ఆర్ చట్టాన్ని ప్రయోగించనున్నారు. డీఫాల్టర్లకు సీఎంఆర్ కేటాయించడాన్ని ప్రభుత్వం తప్పుపడుతోంది. నూటికి నూరు శాతం సీఎంఆర్ ఇచ్చిన వారికి ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం ఇవ్వాలని సూచించింది. రెండేళ్ల నుంచి మొదటి సారి డీఫాల్టర్ అయిన మిల్లర్లకు ధాన్యం కేటాయించొచ్చని పేర్కొన్నది. ఒకటి కంటే ఎక్కువసార్లు డీఫాల్టర్ అయిన మిల్లర్లు బకాయిలతో పాటు అదనంగా 25శాతం జరిమానాతో మొత్తం 125శాతం బియ్యాన్ని ఇస్తూ బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలి. మిల్లింగ్ కోసం ధాన్యం తీసుకునే మిల్లర్లు ధాన్యం విలువకు అనుగుణంగానే బ్యాంక్ గ్యారెంటీ తప్పనిసరి అని.. దీని వల్ల మిల్లర్లు అక్రమంగా బియ్యం అమ్ముకోవడం తగ్గుతుందని ప్రభుత్వం భావి స్తోంది. ఇందుకు అనుగుణంగా నిబంధనలు సవరించింది. కేటాయించిన ధాన్యం మిల్లింగ్ కేపాసిటీని బట్టి మిల్లింగ్‌కు వచ్చే 15 రోజుల ముందే 25 శాతం బ్యాంకు గ్యారెంటీని సమర్పించాల్సి ఉంటుంది. లీజు మిల్లుదారుడైతే ధాన్యంలో 50 శాతం బ్యాంకు గ్యారెంటీ సమర్పించాల్సి ఉంటుంది. లీజు తీసుకున్న మిల్లులో గతంలో యజమాని సీఎంఆర్ డెలివరీ పెండింగ్ లేనట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ల (డీఎం) నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకోవలసి ఉంటుంది. ఈ మేరకు అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే మిల్లులకు కేటాయింపులు ఉంటాయి.



అంతేకాకుండా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నుంచి ఇద్దరు మిల్లర్ల ద్వారా హామీ పత్రం అందజేయాల్సి ఉంటుంది. రెవన్యూ రికవరీ యాక్ట్ అమలులో ఉన్న మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు ఉండవని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడినట్టు తేలిన మిల్లర్లకు, నకిలీ ట్రక్ షీట్లు సృష్టించిన కేసుల్లో ఇరుకున్నవారికి, 6ఏ ఈసీ యాక్ట్, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారికి ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ధాన్యం కేటాయించకూడదని, వీరికి ఈ సీజన్‌తో పాటు వచ్చే రెండు సీజన్ల వరకు వడ్లు ఇచ్చే ప్రసక్తే లేదని తెలుస్తోంది. డీఫాల్ట్ అయిన మిల్లర్లు బకాయిపడ్డ సీఎం ఆర్‌ను అప్పగించి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకుంటేనే కొత్తగా ధాన్యం కేటాయించనున్నారు. మిల్లర్లు లీజు డీడ్ ఇవ్వడంతో పాటు

మిగతా 7వ పేజీలో..

మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను రూపొందించింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా దారి మళ్లించడం, నాణ్యమైన బియ్యం ప్రైవేటుగా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇటీవల పౌరసరఫరాల శాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో నిబంధనల అమలు విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించినట్టు తెలిసింది. ఈ మేరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విధివిధానాలను ప్రభుత్వం కఠినతరం చేసింది. ఇంతకు ముందులాగా ఇష్టానుసారంగా ధాన్యాన్ని మిల్లర్లకు ఇవ్వడానికి వీలులేకుండా నిబంధనల్లో మార్పులు చేర్పులు చేసింది. ముఖ్యంగా డిఫాల్టర్లయిన మిల్లర్లకు ధాన్యం కేటాయించరాదని నిబంధనల్లో పేర్కొన్నది. ఎలాంటి పూచీకత్తు లేకుండా ధాన్యం కేటాయించవద్దని పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి చౌహాన్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

- సీఎంఆర్ నిబంధనలు ఇక కఠినతరం
- ఇష్టానుసారంగా ధాన్యం కేటాయింపులు ఉండవు
- 25 శాతం బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి
- బ్లాక్ లిస్టుల్లో డిఫాల్ట్ అయిన మిల్లర్లు
- నోడ్యూస్ సర్టిఫికెట్ సమర్పిస్తేనే ధాన్యం
- కలెక్టర్లకు సీఎంఆర్ పర్యవేక్షణ బాధ్యత
- జారీ అయిన కొత్త మార్గదర్శకాలు

కొత్త పాలసీ ప్రకటిస్తేనే మిల్లింగ్

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కొనుగోలు కేంద్రాలు సన్నరకాల వరి ధాన్యమే భారీ రానున్నట్టు అంచనాల నేపథ్యంలో కొత్త పాలసీ ప్రకటిస్తే తప్ప ధాన్యాన్ని మిల్లింగ్ చేయబోమని మిల్లర్లు ప్రభుత్వానికి తేల్చిచెబుతున్నారు. ఈ మేరకు ములుగుతో పాటు మరి కొన్ని జిల్లాల రైస్ మిల్లర్ల సంఘాలు ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి నివేదించాయి. ప్రస్తుతం నిబంధనల ప్రకారం మిల్లర్లు క్వింటాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 67 కిలోల బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద అప్పగించాల్సి ఉంటుంది. అయితే దొడ్డురకం ధాన్యం మిల్లింగ్ చేస్తే క్వింటాలుకు సగటున 67 నుంచి 68 కిలోల బియ్యం వస్తుంది. సన్న రకాలకు సంబంధించి మాత్రం కొనుగోలు కేంద్రాల్లో 17 శాతం తేమతో ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి మిల్లింగ్ చేస్తే సగటున 67 కిలోల బియాన్ని సీఎంఆర్ కింద అప్పగించాలంటే క్వింటాలుకు 8 కిలోల వరకు నష్టం వస్తుందని, కనుక కొత్త పాలసీ ప్రకటిస్తే తప్ప ఈ సీజన్‌లో మిల్లింగ్ చేసే అవకాశం లేదని పేర్కొంటున్నారు.

ఆ 'స్టేషన్'లో కానిస్టేబుళ్లదే హవా

- కేసుకో రేటు చొప్పున వసూళ్లు
- ఉన్నతాధికారులకు మించి చక్రం
- ఇబ్బందులు పడుతున్న ఫిర్యాదుదారులు



వరంగల్ క్రైం, సెప్టెంబరు 29: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఓ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుళ్లే చక్రం తిప్పుతున్నారు. వరంగల్- కరీంనగర్ మార్గంలో ఉన్న ఈ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుళ్ల హవా నడుస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇద్దరు కానిస్టే బుళ్లతో పాటు ఓ రైటర్ కేసుకో రేటు చొప్పున వసూళ్ల చేస్తున్నట్లు తెలిసింది. ఆ ఇద్దరు కానిస్టేబుళ్లు ఆ స్టేషన్ పరిధిలో జరిగే వ్యాపారస్తుల నుంచి వసూళ్లు చేయడంతో పాటు ప్రతీ కేసులో జోక్యం చేసుకుని అందినకాడికి బేరం మాట్లా డుతారనే విమర్శలున్నాయి. గతం లో ఈస్టేషన్‌లో ఇద్దరు సీఐల హయాంలో ఈఇద్దరు కానిస్టేబుళ్లు హవా కొన సాగించారనే ఆరోపణలున్నాయి. కేసుల విషయంలో నిందితులతో బేరం మాట్లాడి కేసుల తీవ్రతను తగ్గించడంలో వీరిద్దరు సిద్ధహస్తులను ప్రచారం ఉంది.

ఇక రైటర్ దందాకు అడ్డూ అదుపూలేదనే విమర్శలున్నాయి. స్టేషన్‌కు వచ్చే కేసుల్లో ఇరువర్గాల నుంచి వసూలు చేయడం షరామామూలేనని అంటున్నారు. ఇలాగే ఒక స్థలం వివాదం విషయంలో ఫిర్యాదుదారుడి నుంచి ఈ రైటర్ నేరుగా ఫోన్‌పే ద్వారా రూ.50వేలకు పైగా తీసుకున్నట్లు తెలిసింది. అలాగే రైటర్ ఇంట్లో జరిగిన శుభకార్యానికి ఒక బాధితుడి నుంచి గొర్రెలు సైతం తీసుకున్నట్లు సమాచారం. మరో నేత నుంచి రూ.15వేల వరకు తీసుకున్నట్లు తెలిసింది. ఇలా రైటర్ వసూళ్ల దందా యథేచ్ఛగా సాగిస్తున్నట్లు సమాచారం. ఇదంతా సీఐకి తెలుసే జరుగుతోందా అనే అనుమానాలున్నాయి. ఈ కానిస్టేబుళ్ల దందా కట్టడికి ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా ఫణిందర్

రాంనగర్, సెప్టెంబరు 29: వరంగల్ ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా డి.ఫణిందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో రిజిస్ట్రేషన్ శాఖలో జరిగిన బదిలీల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బదిలీల ప్రక్రియను సమీక్షించి పలువురిని బదిలీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పలువురు రిజిస్ట్రార్‌లను శనివారం బదిలీ చేశారు. ఖమ్మం నుంచి బదిలీపై వచ్చి వరంగల్ ఆడిట్ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న ఫణిందర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. అయితే రిజిస్ట్రేషన్ డీఐజీ సుభాషిణికి ఆడిట్ విభాగం అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, రిజిస్ట్రార్‌గా నియమించబడిన ఫణిందర్ సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది. ఇక్కడి నుంచి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లిన రవి తిరిగి ఇక్కడికి వస్తాడని ఇన్నాళ్లూ జరిగిన ప్రచారానికి ఫణిందర్ నియామకంతో తెరపడినట్లు అయింది.

బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 29: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

లోన్ యాప్‌కు ఒకరి బలి

- క్రిమిసంహారక మందు తాగి యువకుడి ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

భీమదేవరపల్లి, సెప్టెంబరు 29: లోన్ యాప్ వేధింపులతో మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడ్గుల అనిల్ (29) అనే యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తల్లి వినోద ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం..

ముల్కనూరుకు చెందిన వినోద-సారయ్య దంపతుల చిన్నకుమారుడు అనిల్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. నిరుద్యోగిగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఉపాధి కోసం తన స్నేహితులు, బంధువులతో కలిసి వివిధ రకాలైన యాప్‌లు, బ్యాంకుల ద్వారా సుమారు రూ.9లక్షల వరకు అప్పులు చేశాడు. హనుమకొండలోని భీమారంలో మొబైల్ టిఫిన్ సెంటర్‌ను పెట్టుకొని జీవిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. దీంతో రెండు నెలల కిందట మరింత అప్పు చేసి ముల్కనూర్ గ్రామంలో అమరవీరుల స్థూపం వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కూడా నష్టాలు వచ్చాయి. యాప్‌లో రుణాలు తీసుకున్న అప్పులు కట్టలేక ఈనెల 25న అనిల్ ఇంటి నుంచి బయటికెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున ముల్కనూర్ రైతు వేదిక వద్ద క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు. గమనించిన బంధువులు అనిల్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతురాలి తల్లి వినోద తన కుమారుడు వ్యాపారాల్లో వచ్చిన నష్టాలతో అప్పులు కట్టలేక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు తెలిపారు. కాగా, మృతుడి తండ్రి గతంలోనే మృతి చెందగా తల్లి వినోద కూలి పనులు చేస్తూ జీవిస్తోంది.

కేటీఆర్.. నోరు జాగ్రత్త!

- అధికారం పోయినా అహం పోలేదు..
- చర్చకు రమ్మంటే ముఖం చాటేశావ్..
- పదేళ్లలో నయీంనగర్ బ్రిడ్జిని ఎందుకు పూర్తి చేయలేదు?
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి




నయీంనగర్ బ్రిడ్జి వద్ద మీడియాకు బ్రిడ్జి నిర్మాణ దశలను చూపెడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 29: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్.. తన నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి విషయంలో తనను వాడు.. వీడు.. అంటూ కేటీఆర్ సంబోధిస్తూ మాట్లాడారని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఇదేనా కేటీఆర్ సంస్కారం అంటూ మండిపడ్డారు. ఆదివారం హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి వద్ద రాజేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. నయీంనగర్ బ్రిడ్జిని తామే నిర్మించామని మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ తప్పుడు ప్రచారం జరపడమే కాకుండా తనపై నోరు పారేసుకున్నారని తెలిపారు. ఈక్రమంలో నయీంనగర్ బ్రిడ్జి వద్దకు శుక్రవారం చర్చకు రావాలని మూడు రోజుల కిందటే తాను సవాల్ విసిరినట్లు రాజేందర్‌రెడ్డి వివరించారు. చర్చకు కేటీఆర్, వినయ్ భాస్కర్ తప్పించుకున్నారన్నారు.

పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు.. నయీంనగర్ బ్రిడ్జిని ఎందుకు కొత్తగా నిర్మాణం చేపట్టి పూర్తి చేయలేకపోయారని నాయిని ప్రశ్నించారు. కమీషన్లు గిట్టుబాటు కాకపోవడంవల్లే పట్టించుకోలేదని ఆరోపించారు. వరదల సమయంలో బ్రిడ్జిని స్వయంగా పరిశీలించిన కేటీఆర్.. ఆ సమయంలో రూ.10వేలు ఒక్కో వరద బాధిత కుటుంబానికి అందచేస్తామని ప్రకటించారని, కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఇది చాల దన్నట్లు బ్రిడ్జి తమ హయాంలోనే నిర్మాణం చేపట్టామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నయీంనగర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రతీ రోజు పర్యవేక్షిస్తూ నిర్దేశిత సమయంలో పూర్తి చేశామని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని బీఆర్ఎస్ నేతలు అసంపూర్ణంగా వదిలేశారని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి రూ.45కోట్ల నిధులు తీసుకొచ్చి కళాక్షేత్రం నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. భద్రకాళి మాడ వీధుల నిర్మాణాన్ని కూడా విస్మరించారని దుయ్యబట్టారు. కేటీఆర్‌కు హైడ్రా అంటే వణకు పుడు తోందని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అసత్యాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తూ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతు న్నాడని విమర్శించారు. తమ ఫామ్ హౌస్‌లు, అక్రమ నిర్మాణాలు కూలుతాయో అనే భయంతో కేటీఆర్ ఇతర బీఆర్ఎస్ నాయకులు హైడ్రాను విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు.

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళాదేవి మాట్లాడుతూ.. కేటీఆర్ చర్చకు వస్తే ఆయనను మంగళహారతులతో ఆహ్వానిద్దామని తలచామని చెప్పారు. అయితే చర్చకు రాకపో వడంతో ఆయనకు గాజులు, చీరెలు ఇచ్చేందుకు సిద్ధపడామంటూ వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకన్న, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, బత్తిని శ్రీనివాస్, మార్క విజయ్, డాక్టర్ పెరుమాండ్ల రామక్రిష్ణ, డాక్టర్ అనిల్, డాక్టర్ శ్రవణ్‌కుమార్, బొమ్మతి విక్రమ్, రహీమున్నీసా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బల్దియాలో నీటి దొంగలు!

- పేదలకు అందాల్సిన నీరు అక్రమంగా విక్రయం
- కార్పొరేట్ విద్యాసంస్థలు, బడా హోటళ్లకు సరఫరా
- ట్యాంకర్ నీటికి రూ.600 వసూలు
- చోద్యం చూస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 29: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని నీటి సమస్యాత్మక ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో నివసించే నిరుపేద ప్రజలకు అందించాల్సిన మునిసిపల్ తాగునీరును కొందరు సిబ్బంది అడ్డదారిలో అమ్ముకుంటున్నారు. బడా హోటళ్లు, కార్పొరేట్ విద్యాసంస్థలు, రెస్టారెంట్లు, ప్రైవేటు కట్టడాలకు, ప్రైవేటు ఆస్పత్రులు, ప్రైవేటు హాస్టళ్లు, ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లకు యథేచ్ఛగా తాగునీటి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 7 గంటల వరకు ఈ నీటి సరఫరా అంతా గప్‌చుప్‌గా జరిగిపోతోంది. నక్కలగుట్ట, చార్‌బౌళి, కాజీపేట వాటర్ ట్యాంక్‌ల నుంచి నీటిని నింపుకుని కొందరు డ్రైవర్లు నీటి చౌర్యానికి పాల్పడుతున్నారు. సుబేదారిలోని ఓ ఇంటర్నేషనల్ హోటల్‌లో నీటిని నింపుతూ దొరికిపోయిన ఉద్యోగిని ప్రశ్నించగా 'సార్ పోయమన్నాడు.. పోస్తున్నాం..' అంటూ బదులిచ్చాడు. వివరాలు అడుగగా ట్రిప్పుకు రూ.600 ఇస్తున్నట్టు వెల్లడించాడు. బల్దియా వాటర్ ట్యాంకర్లు రోజుకు ఆరు ట్రిప్పుల చొప్పున ఇతర ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.



ఓ హోటల్‌లో నీటిని నింపుతున్న బల్దియా డ్రైవర్

అడ్డదారిలో నీటి సరఫరా

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రెండేళ్ల కిందట ప్రజలకు నీటి సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచారు. ఇందులో 4 కాజీపేట, 6 నక్కలగుట్ట, 6 చార్‌బౌళి, 6 కంటి ఆస్పత్రికి చొప్పున మొత్తంగా 22 వాటర్ ట్యాంకర్లు నడిపేందుకు కొందరు ఔత్సాహికులు కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. ఒక ట్యాంకర్‌కు బల్దియా నెలకు రూ.33వేలు చెల్లిస్తుంది. కానీ వారు టెండర్ల సమయంలో చూపించిన వాటర్ ట్యాంకర్లు కాకుండా కాలం చెల్లిన వాహనాలకు రంగులు అద్ది నడుపుతున్నట్టు తెలిసింది. అంతేకాకుండా బల్దియా పరిధిలో నడిచే ఏ ఒక్క వాటర్ ట్యాంకర్‌కు కూడా రిజిస్ట్రేషన్, బండి నెంబర్, రోడ్డు ట్యాక్సీ లేకుండా నగరంలో నీటి చోరీకి పాల్పడుతూ చక్కర్లు కొడుతున్నాయి. ఇలా- ఒక్కో వాటర్ ట్యాంకర్ యజమాని యేటా రూ.3.96లక్షలు అప్పనంగా నొక్కేస్తున్నారు. వాటర్ ట్యాంకర్‌లను బల్దియాకు అప్పగించి యజమానులు బిల్లులు నొక్కేస్తుంటే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, ట్యాంకర్ డ్రైవర్లు ప్రజలకు అందించే నీటిని పక్కదారిలో తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ప్రైవేటు సంస్థల నుంచి ఒక వాటర్ ట్యాంకర్ నెలకు రూ.30నుంచి రూ.40వేల వరకు అడ్డదారిలో సరఫరా చేసిన నీటి నుంచి సంపాదిస్తున్నట్టు తెలుస్తోంది. వచ్చిన డబ్బులు ఇంజనీరింగ్ అధికారులు తీసుకుని డ్రైవర్లకు కొంత ముట్టజెప్తుతున్నట్టు సమాచారం.

వారం వారం వసూలు

బల్దియా మంచి నీటిని బడా హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరా చేసిన తర్వాత సంబంధిత డ్రైవర్లు వారం వారం ఆప్తా పేరుతో బిర్యానీ, మటన్, చికెన్‌లను సేకరించి అధికారులకు అప్పగిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇద్దరు ట్యాంకర్ డ్రైవర్‌లను డబ్బులతో పాటు అప్తా వసూలుకు కేటాయించినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా వాటర్ ట్యాంకర్లు నడిపేవారు దాదాపు 60 యేళ్లు దాటిన వారే ఎక్కువగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. లైసెన్స్ లేని డ్రైవర్లు ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని తెలిసికూడా ఇంజనీరింగ్ అధికారులు వారిని ప్రోత్సహిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా కమిషనర్ ఫిట్‌నెస్ లేని వాహనాలను గుర్తించడంతో పాటు అడ్డదారిలో కార్పొరేట్ సంస్థలకు, హోటళ్లకు నీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకర్లను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేలేరు, సెప్టెంబరు 29: చెట్టుపై నుంచిపడ్డ సూత్రపు కనుకయ్య (60) అనే వృద్ధుడు మృతి చెందినట్టు ఎస్సై సురేష్ ఆదివారం తెలిపారు. వేలేరు మండల కేంద్రానికి చెందిన కనుకయ్య ఈనెల 15న గ్రామంలో వినాయకుడికి పూజ కోసం పూలను కోసేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. చెట్టు ఎక్కి పూలను కోస్తుండగా కాలుజారి చెట్టుపై నుంచి కనుకయ్య కిందపడిపోవడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

ధర్మసాగర్, సెప్టెంబరు 29: ఇటీవల ధర్మసాగర్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన ధార కనుకయ్య (60) కుటుంబాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్, ప్రభుదేవ్, తరుణ్, రాకేష్, ఆగస్టిన్ పాల్గొన్నారు.

DEVARA THANDAVAM



సుదర్శన్ 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.00,2.30,6.15,9.45

సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి క్రాస్ రోడ్స్
11.00,2.30,6.00,9.30

SVC సంగీత 70 - ఆర్.సి.పురం 11.00,2.30,6.00,9.30
SVC ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.30
SVC శ్రీలక్ష్మి (ఇంద్ర నరేంద్ర) - కర్మన్‌ఘాట్ 11.15,2.45,6.30,10.00
SVC శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.00,2.30,6.00,9.30
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.30,6.00,9.30
శ్రీసాయిరాం 70 - మల్కాజ్‌గిరి 11.15,2.45,6.30,10.15


హిందీ వెర్షన్

MASS JATHARA



వరంగల్ / నిజామాబాద్ / ఆదిలాబాద్ / మెదక్ / మహబూబ్‌నగర్ / ఖమ్మం / కరీంనగర్ / నల్గొండ / రంగారెడ్డి / రాయచూర్

అక్టోబర్ 3న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
SRI VIJAYA FILMS

అక్టోబర్ 4న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

అక్టోబర్ 4న బ్రహ్మాండమైన విడుదల



లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
SRI LAKSHMI PICTURES RELEASE 9885291789

BLOCKBUSTER HIT నేడే చూడండి



దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ (175/- 110/- 55/-)
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.30,6.00,9.30

వరంగల్ / నిజామాబాద్ / ఖమ్మం / కరీంనగర్ / మహబూబ్‌నగర్ / మెదక్ / నల్గొండ / రంగారెడ్డి / రాయచూర్
GLOBAL CINEMAS RELEASE

అక్టోబర్ 4న బ్రహ్మాండమైన విడుదల



SRI LAKSHMI GAYATRI FILMS 9391176659

అక్టోబర్ 4న బ్రహ్మాండమైన విడుదల



సంధ్య 35ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound

RUDRA CREATIONS THRU PARAMJYOTHI FILMS 9848028739



ట్రాఫిక్ అధికారులకు బాడీ వార్న్ కెమెరాలు అందిస్తున్న ఏసీపీ సత్యనారాయణ

ట్రాఫిక్ పోలీసులకు బాడీ వార్నింగ్ కెమెరాలు

- దాడుల నియంత్రణకు పోలీసుశాఖ నిర్ణయం
- ప్రతీ స్టేషన్‌కు మూడు చొప్పున కెమెరాలు అందజేత

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 29: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మందుబాబులను కట్టడి చేసేందుకు ట్రైసిటీ పరిధిలోని ట్రాఫిక్ పోలీసుల చేతుల్లోకి బాడీ వార్న్ కెమెరాలు వచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. మందుబాబులు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ హెచ్చరించారు. ట్రైసిటీ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో పాటు శాంతిభద్రతల పర్యవేక్షణ విధులు నిర్వహించే సమయంలో ప్రజల నుంచి ఎదురయ్యే సమస్యలు, దాడుల నియంత్రణ కోసం పోలీసుశాఖ ప్రధాన కార్యాలయం నుంచి బాడీ వార్న్ కెమెరాలు మంజూరైనట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లకు ఒక్కొక్క పోలీస్‌స్టేషన్‌కు మూడు బాడీ వార్న్ కెమెరాలను ఆదివారం ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులకు అందజేసినట్లు ఏసీపీ తెలిపారు. ఇకపై నగరంలో ట్రాఫిక్ పోలీసుల అధికారులు బాడీ వార్న్ కెమెరాలు ధరించి తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. తనిఖీల సమయంలో ఎవరైనా వాహనదారుడు పోలీసులపై దాడులకు పాల్పడిన, దూషించి విధులకు ఆటంకం కలిగించే ప్రవర్తించిన పోలీసు అధికారి యూనిఫామ్‌పై ఉన్న కెమెరా సంఘటనాస్థలంలో వాస్తవాలను చిత్రీకరిస్తుందన్నారు. ట్రాఫిక్ అధికారులు తనిఖీ సమయంలో పారదర్శకంగా విధులు నిర్వర్తించేందుకు సైతం అనువుగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు షూకూర్, రామకృష్ణ, నాగబాబు, ఎస్సైలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 29: భూపాలపల్లి జిల్లాలోని ముత్య కిడ్నీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు డాక్టర్ బచ్చు చందు క్రిష్ణ, డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ పాపయ్య నిర్మల్ పూదోట, డాక్టర్ సందీప్ మాచర్ల పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. బీసీ, షుగర్, క్రియాటిన్, సీబీపీ లాంటి రోగ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేశారు. సుమారు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

సైన్స్ సెంటర్ దశ మారేనా?

- 9 ఏళ్లుగా అరకొర నిధులతోనే నిర్వహణ
- రూ. 4 కోట్లతో మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే నాయిని చొరవతో అభివృద్ధికి ముందడుగు
- జనవరి లోపు పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 : విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజల్లో సైన్స్ పట్ల అవగాహన కల్పించేందుకు శాస్త్రీయ దృక్పథం, ఆలోచన విధానాలను పెంపొందించేందుకు వరంగల్‌లో ఏర్పాటు చేసిన రీజనల్ సైన్స్ సెంటర్ నిధుల లేమిలో కొట్టుమిట్టాడుతోంది. టీజీకాస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ సెంటర్‌కు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. సైన్స్ సెంటర్ నిర్వహణ, అభివృద్ధి కోసం సాలీన రూ. 60లక్షలు మంజూరు చేసి అందులో సగభాగం సైన్స్ సెంటర్ నిర్వహణకు, మరో సగం నిధులు అభివృద్ధి కోసం వెచ్చించే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేసింది. ప్రభుత్వం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు అందులో 10 శాతం నిధులను సైతం విదిలించలేదు. సైన్స్ ఉపకరణాలు పాడైపోతే వాటి సరి చేయించడం ఇబ్బందిగా మారుతోంది. దీంతో పదుల సంఖ్యలో ఉపకరణాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. 69 ఉపకరణాలు ఉండగా అందులో 20 వరకు పనిచేయకుండా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిర్వహణ, అభివృద్ధి నిధులు నిలిచిపోవడంతో పనిచేయని ఉపకరణాలను సరిచేసేందుకు నిధులు లేవు. సందర్శకుల నుంచి వసూలు చేస్తున్న రుసుముతోనే బొటాబొటి నిర్వహణ పనులు చేపడుతున్నారు. నిధుల లేమితో నిర్వహణ కష్టమవుతున్నట్లు కనిపిస్తోంది. సందర్శకులు తాకిడి తక్కువగానే ఉంటున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు ఆశించిన మేరకు సైన్స్ సెంటర్‌ను సందర్శించడం లేదు. ఆ మేరకు సంబంధిత విద్యాశాఖాధికారులు చర్యలు తీసుంటున్నట్లు కనిపించడం లేదు.

1999లో బీజం..

ఉన్నత లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు సైన్స్ కేంద్రాలను నెలకొల్పాలని ప్రతిపాదించి ఒకటి వరంగల్, మరొకటి విజయవాడలో నెలకొల్పేందుకు 1999లో భూమిపూజ చేశారు. వరంగల్‌లోని హంటర్ రోడ్డులో 14.3 ఎకరాల సువిశాల ఎత్తైన స్థలంలో దీని నిర్మాణం కోసం రూ. 5.68 కోట్లు వెచ్చించారు. 2015 అక్టోబర్ 21న అప్పటి ఉప ముఖ్యమంతి కడియం శ్రీహరి చేతుల మీదుగా రీజనల్ సైన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ - టీజీసీఓఎస్‌టీ (టీజీకాస్ట్)) ఆధ్వర్యంలో సైన్స్ సెంటర్ నడుస్తోంది. రూ.5కోట్లు భవన నిర్మాణం, ఇతరత్రా సౌకర్యాల కోసం ఖర్చు చేస్తే రూ.68లక్షలను సైన్స్ ఉపకరణాలను ఏర్పాటు చేసేందుకు వెచ్చించారు. ఇందులో 59 ఇండోర్ సైన్స్ ఉపకరణాలు ఉండగా 10 అవుట్‌డోర్ ఉపకరణాలు ఉన్నాయి. ఏటా రూ.60లక్షలను నిర్వహణ అభివృద్ధి కోసం సైన్స్ సెంటర్‌కు నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నప్పటికీ ఆ మేరకు నిధులు మంజూరు చేయకపోవడంతో సైన్స్ సెంటర్ నిర్వహణ భారమవుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం రోజున రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ వాణీప్రసాద్ రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడి పరిస్థితులను గమనించిన ఆమె సెంటర్ మరమ్మతుల కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అప్పటి కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను ఆదేశించారు. దీంతో కుడా ఇంజనీర్ల బృందం సైన్స్ సెంటర్‌లో మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం రూ.4కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఆ పనులు త్వరలోనే పట్టాలెక్కనున్నాయి. ఇప్పటికైనా వరంగల్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్‌కు మహర్దశ పట్టనుంది.



సైన్స్ సెంటర్ ముఖద్వారం

పాక్షికంగా శిథిలావస్థకు భవన సముదాయం

సైన్స్ సెంటర్ భవనం పాక్షికంగా శిథిలమవుతోంది. బయట గోడలకు ఎలివేషన్‌గా అలంకరించిన టైల్స్ ముక్కలు రాలిపోతున్నాయి. ఇక లోపలి గోడలు పాడవుతున్నాయ. స్లాబ్ కురుస్తుండటంతో గోడలు తడిబారి అక్కడక్కడ పాడైపోయాయి. భవనానికి ఉన్న అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సైన్స్ సెంటర్‌లో 69 సైన్స్ ఉపకరణాలు ఉండగా అందులో 20పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. మరికొన్ని పాక్షికంగా పనిచేయడం లేదు. ఇకమూడు టెలిస్కోపులుండగా ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది.

ప్రతిపాదిత పనులు ఇవే..

కుడా ఇంజనీర్ల బృందం భవనానికి మరమ్మతులు, సైన్స్ సెంటర్ చుట్టూ ఉన్న పరిసరాల్లో ఉన్న పెద్ద పెద్ద రాళ్లపై శాస్త్రవేత్తల బొమ్మలు, సెంట్రల్ ఏసీ, సెంటర్ చుట్టూ గ్రీనరీ, ప్రహరి నిర్మాణంకోసం రూ.4కోట్లతో ప్రతిపానలు సిద్ధం చేశారు. ఆ తర్వాత కొత్తపరికరాల కోసం మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేసి కొత్త పరికాలు సమకూర్చేందుకు సైతం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

విడుదలైన నిధులు

- 2020 వరకు అంతంత మాత్రంగానే విడుదలైన నిధులు ఆ తర్వాత ఒక్క పైసా కూడా విడుదల కాలేదు.
- 2014-15లో రూ. 15,12000 ప్రతిపాదించి అంతే నిధులు విడుదల చేశారు.
- 2015-16లో రూ. 6 లక్షల రూపాయలు ప్రతిపాదించి రూ. 3 లక్షలు మాత్రమే మంజూరు చేశారు.
- 2016-17లో రూ. 6 లక్షల రూపాయలు ప్రతిపాదించి రూ. 3 లక్షలు మాత్రమే మంజూరు చేశారు.
- 2017-18లో రూ. 6 లక్షలు ప్రతిపాదించి రూ. 2.7 లక్షలు మంజూరు చేశారు.
- 2018-19లో రూ. 6 లక్షలు ప్రతిపాదించి రూ. 90 వేలు మంజూరు చేశారు.
- 2019-20లో రూ. 76 వేలు ప్రతిపాదించి రూ. 39 వేలు మంజూరు చేశారు.

ఎమ్మెల్యే నాయిని చొరవతో ముందడుగు

తన నియోజకవర్గంలోని రీజనల్ సైన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నారు. ఆయన చొరవతో సైన్స్ సెంటర్ అభివృద్ధి పనులకు ముందడుగులు పడుతున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీకాస్ట్ మెంబర్ సెక్రెటరీ డాక్టర్ నుంకె రాజేంద్రప్రసాద్ తదితరులతో కలిసి కుడా ప్రతిపాదించిన రూ.4కోట్ల పనుల వివరాలను పర్యవేక్షించేందుకు సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఆదేశాలతో కదిలిన జిల్లా యంత్రాంగం కుడా ఆధ్వర్యంలో పనులకు శ్రీకారం చుట్టి జనవరిలోగా అవసరమైన వసతులను కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించే పనిలో పడ్డారు.



పాక్షికంగా శిథిలమైన సైన్స్ సెంటర్ భవన సముదాయం



సైన్స్ సెంటర్‌లోని కొన్ని సైన్స్ ఉపకరణాలు

మిల్లర్లకు ముకుతాడు!

(5వ పేజీ తరువాయి)

కేటాయించిన ధాన్యానికి బ్యాంక్ గ్యారెంటీ తప్పని సరికానున్నది. రైస్ మిల్లులు తమకు కేటాయించిన ధాన్యాన్ని ఏడాదిన్నర వరకు కూడా మిల్లింగ్ పూర్తి చేయ కుండా తమ వద్దే నిల్వ ఉంచుకుం టున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. తద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడం, ఎఫ్‌సీఐ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలో ఆలస్యం చేయడం వంటి పరిణామా లు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మిల్లులు సీఎంఆర్ కోసం ప్రతీ రోజు రెండు షిప్టుల్లో 16 గంటలు పని చేయాలని మార్గదర్శకాల్లో పొందుపరిచారు. ముడిబియ్యం ఇచ్చే రారైస్ మిల్లులకు వడ్లు కేటాయిస్తే 8 గంటల చొప్పున రెండు షిప్టుల్లో రోజుకు 16 గంటలు మిల్లింగ్ చేసి 75 రోజుల్లో కేటాయించిన ధాన్యంలో 67 శాతం రారైస్ ఇవ్వాల్సి ఉంటుంది. మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం కేటాయించనున్నారు.

కలెక్టర్లకు బాధ్యతలు

జిల్లాల వారీగా రైస్ మిల్లుల్లో సాగే సీఎంఆర్‌పై కలెక్టర్లకే బాధ్యతలు అప్పగించనున్నారు. ధాన్యం కొనుగోళ్ల నుంచి మిల్లింగ్ వరకు వారే కీలకం. బాయిల్డ్ రైస్ మిల్లర్లు పోర్టిఫైడ్ రైస్ ఇచ్చేందుకు డిసెంబర్ 31లోగా ఎఫ్ఆర్‌కే బ్లెండింగ్, సోరెక్స్ మెషిన్లు అమర్చుకునేలా ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకొని వారికే ధాన్యం కేటాయించాల్సి ఉంటుంది. జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి అర్హత ఉన్న మేరకే ధాన్యం కేటాయించాలి. మిల్లులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కేటాయించిన ధాన్యం దారిమళ్లినా, ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రైవేటుగా విక్రయించినా క్రిమినల్ చర్యలు తప్పనిసరి.



10 వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులతో గౌడ సంఘం నాయకులు

గౌడ విద్యార్థులు విద్యలో రాణించాలి

గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయ్యన్న గౌడ్

న్యూశాయంపేట, సెప్టెంబరు 29: గౌడ విద్యార్థులు విద్యా రంగంలో రాణించాలని గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న గౌడ్ అన్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన 10 మంది గౌడ విద్యార్థులకు ఆదివారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ గౌడ హాస్టల్‌లో ప్రశంసపత్రం, మెమెంటో, శాలువాతో సత్కరించి ఒక్కో విద్యార్థికి రూ.2000 నగదును సర్దార్ సర్వాయి పాపన్న, కౌండిన్య పరపతి సంఘం సహకారంతో అందజేశారు.

ఈ సందర్భంగా సాయన్న గౌడ్ మాట్లాడుతూ.. చదువు పేదరికానికి ఎప్పుడు అడ్డుకాకూడదని, విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో స్థిరపడి కులానికి, సమాజానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న, కౌండిన్య పరపతి సంఘం అధ్యక్షులు అంబాల సూర్యనారాయణ గౌడ్, గోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొడిశాల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూదన్ గౌడ్, కేయూ పాలక మండలి సభ్యులు చిర్ర రాజు గౌడ్, వరంగల్ గోపా అధ్యక్షులు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, కౌండిన్య పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి గట్టు సత్యనారాయణగౌడ్, సభ్యులు బత్తిని రమేష్ గౌడ్, కొండ నరేందర్, పెరుమాండ్ల అనిల్ గౌడ్, గట్టు ప్రభాకర్ గౌడ్, కంకటి సాగర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



సభలో అభివాదం చేస్తున్న ఎరుకల సంఘం నేతలు

ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ.500కోట్ల బడ్జెట్ కేటాయించాలి

ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు

వడ్డెపల్లి, సెప్టెంబరు 29: ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ.500కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి సభలో ఆయన మాట్లాడారు. ఎరుకల నిరుద్యోగ యువతి, యువకులకు గ్రూప్-1, 2, 3, 4 ఉద్యోగాల భర్తీ కోసం హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక ఏకలవ్య స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా 50 వేల కుటుంబాలు పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నాయని, పందులను షెడ్లలో పెంచుకోవడానికి ప్రతీ కుటుంబానికి రూ. 10 లక్షల వ్యక్తిగత రుణ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇల్లులేని పేద ఆదివాసీ ఎరుకల కుటుంబాలకు ఏకలవ్య కార్పొరేషన్ ద్వారా ప్రతీ జిల్లాకు 500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ఎరుకల జాతి మూల పురుషుడు ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏకలవ్య కార్పొరేషన్ నిధుల నుంచి ట్యాంక్ బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ సభలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ఓని సదానందం, జిల్లా నాయకులు పల్లకొండ ప్రభాకర్, పులిచేరు సారయ్య, భూనాద్రి రంజిత్, మానుపాటి సురేందర్, విజయేందర్, భిక్షపతి, సాంబశివ, శ్రీనివాస్, అంబి రాజు, మేనగుర్తి రఘు, పల్లకొండ రవి, మానుపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

రెండు మ్యాచ్‌లు గెలిచి ముందంజలో మహబూబ్‌నగర్ జట్టు



వరుసగా లీగ్‌లో రెండు మ్యాచ్‌లు గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో జిల్లా సభ్యులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 29: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నగరంలోని వివిధ క్రీడా మైదానాల్లో నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్‌టోర్నీ పోటాపోటీగా కొనసాగుతున్నాయి. ఆదివారం కోమటిపల్లిలోని ఫోర్ట్ క్లబ్ క్రికెట్ మైదానంలో మహబూబ్‌నగర్ - నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోరులో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నల్లగొండ జట్టుపై వరుసగా రెండుసార్లు విజయం సాధించడంతో లీగ్‌దశలో ముందుంజలో ఉంది. అదేవిధంగా పూల్ ఏలోని వరంగల్ - మెదక్ జట్ల మధ్య మొగిలిచర్ల క్రీడామైదానంలో పోటీలు నిర్వహించగా ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు మెదక్ జట్టుపై విజయం సాధించి చెరొక విజయాన్ని అందుకొని సమంగా పోటీలో ఉన్నాయి.

రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 8జట్లను ఎంపిక చేసి రెండు ఏ, బీ పూల్‌గా విభజించి అక్టోబరు 5వరకు పోటీలను నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. పూల్ ఏలో మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, మెదక్ జిల్లాలకు చెందిన 4జట్ల మధ్య ఈ నెల 30వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూల్ బీలోని ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లకు అక్టోబరు 1నుంచి 5వరకు పోటీలను నిర్వహిస్తామన్నారు. కాగా కోమటిపల్లి ఫోర్ట్‌క్లబ్ క్రికెట్ మైదానంలో మహబూబ్‌నగర్ - నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోటీల్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. జట్టులోని ఓపెనర్ బ్యాట్స్‌మెన్ అబ్దుల్ రఫీ రెండు సిక్స్‌లు, 6ఫోర్ల సహాయంతో 71పరుగుల చేసి మహబూబ్‌నగర్ జట్టు గెలుపులో ముఖ్యభూమిక పోషించాడు. 187 పరుగుల లక్ష్యసాధనతో తదుపరి బ్యాటింగ్ బరిలోకి దిగిన నల్లగొండ జిల్లా జట్టు కేవలం 32ఓవర్లను ఎదుర్కొని 98పరుగులకే ఆలౌట్ కావడంతో మహబూబ్‌నగర్ జట్టు నల్లగొండ జట్టుపై 88పరుగుల తేడాతో రెండోసారి ఘన విజయం సాధించింది.

అదే విధంగా వరంగల్ - మెదక్ జట్ల మధ్య మొగిలిచర్ల క్రీడా మైదానంలో నిర్వహించిన పోరులో ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న వరంగల్ జట్టు నిర్ణీత 50ఓవర్లగాను 49.2 ఓవర్లను ఎదుర్కొని 219పరుగుల చేసింది. 220భారీ పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు తదుపరి బ్యాటింగ్ బరిలోకి దిగిన మెదక్ జట్టు 29.4ఓవర్లను ఎదుర్కొని కేవలం 110పరుగుల వద్ద ఆలౌట్ కావడంతో వరంగల్ జట్టు మెదక్ జట్టుపై 109పరుగుల తేడాతో ఘన విజయాన్ని సాధించింది. వరంగల్ జిల్లా జట్టులోని ఆల్‌రౌండర్ వితీష్ 31పరుగులు చేసి 3వికెట్లను తీయగా ఇదే జట్టుకు చెందిన మరో ఆల్ రౌండర్ రిశ్కాంత్ 3వికెట్లను తీసి వరంగల్ జిల్లా జట్టు గెలుపులో కీలక భూమిక పోషించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఖాజా, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, బండారి ప్రభాకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పూట గడవని స్థితిలో క్రీడా కుసుమం

- అనారోగ్యంతో అంతర్జాతీయ వాలీబాల్ మాజీ కోచ్ అవస్థలు
- వైద్య చికిత్స కోసం అష్టకష్టాలు.. తాత్కాలికంగా చేరదీసిన శిష్యుడు



ఆదుకోవాలని వేడుకుంటున్న భిక్షపతి

కేసముద్రం, సెప్టెంబరు 29 : అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసిన ఒకప్పటి వాలీబాల్ కోచ్ వృద్ధాప్యంతో ఆలనాపాలనా చూసేందుకు ఎవరూ లేక శిష్యుడి ఇంట్లో తలదాచుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి పేరు వినగానే వాలీబాల్ క్రీడ గుర్తొస్తుంది. ఆ క్రీడలో ఉమ్మడి వరంగల్ జిల్లానే కాకుండా రాష్ట్ర స్థాయిలో ఎక్కడ క్రీడాపోటీలు నిర్వహించినా ఈ గ్రామానికే ప్రథమస్థానం. స్పైకింగ్‌లో నైపుణ్యం, బూస్టింగ్‌లో చురుకుదనంతో మెరికల్లాంటి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతారు. టెక్నికల్ ఆటను ప్రదర్శిస్తూ ఇట్టే ఆకట్టుకుంటారు. క్రీడాభిమానులు సైతం ఇనుగుర్తి టీం ఆటను ప్రత్యేకంగా, ఆసక్తిగా వీక్షిస్తారు. ఇక్కడి నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిరిగారు అలాంటి ప్రతిభావంతులు తయారవడం వెనుక దివంగత కందునూరి కొమురయ్యతోపాటు ఆయన సహాయకుడు సట్ల భిక్షపతి కృషి ఎంతో ఉంది. మెరికల్లాంటి ఆటగాళ్లను తయారు చేసిన కోచ్ ఇప్పుడు దీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. పూటగడవని దుస్థితిని ఎదుర్కొంటున్నాడు. ప్రభుత్వం చేయూతనివ్వాలని, ఆలనాపాలనా చూసుకునేందుకు వృద్ధాశ్రమంలో చేర్పించాలని వేడుకుంటున్నాడు.

కొమురయ్యకు సహాయకుడిగా..

ఇనుగుర్తి గ్రామంలో జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదిగి, ఉద్యోగాలు పొంది స్థిరపడిన క్రీడాకారులు 100 మందికిపైగా ఉన్నారు. అలాంటి క్రీడకు గ్రామంలో పునాది వేసింది దివంగత కందునూరి కొమురయ్య అయితే ఆయనకు సహచరుడిగా క్షేత్రస్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దింది కోచ్ సట్ల భిక్షపతి. 1973-1985 ప్రాంతంలో కోచ్‌గా కొనసాగి ఎంతోమందికి శిక్షణనిచ్చారు. అలాంటి కోచ్ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. 72 ఏళ్ల వయస్సున్న ఆయన గుండె, కిడ్నీ సంబంధించిన వ్యాధితో బాధపడుతూ చికిత్సపొందుతున్నారు. మరోవైపు షుగర్, బీపీ సైతం ఉన్నాయి. 1992లో క్యాన్సర్‌బారిన పడి చికిత్స తీసుకోగా నయమైంది. ఈ వ్యాధుల చికిత్స కోసం మందుల కొనుగోలు కోసం నెలకు రూ.15 వేలు ఖర్చవుతున్నాయి. సొంత ఇల్లు లేక ఒకప్పటి వాలీబాల్ శిష్యుడైన గంజి రాంమోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో తన ఇంట్లోనే ఆశ్రయమిచ్చి భోజనం పెడుతున్నాడు. ఆరోగ్యం సరిగాలేక వృద్ధాప్యంతో భిక్షపతి ఒకరి సహాయంతో కాలకృత్యాలు తీర్చుకోవడం ఆ తర్వాత ఎటూ వెళ్లలేని స్థితిలో మంచంలోనే ఉంటున్నాడు.

సరిపోని 'ఆసరా'..

ఆసరా పథకంలో భిక్షపతికి వృద్ధాప్యం పింఛను వస్తున్నప్పటికీ అవి ఏమూలకు సరిపోవడంలేదు. ఆయన శిక్షణలో క్రీడాకారులుగా ఎదిగి ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు స్పందించి 2021లో రూ.70వేలు ఆర్థిక సహా యాన్ని అందించారు. అవి కూడా వైద్య చికిత్సలకు అప్పుడే అయిపోయాయి. జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారు లను అందించిన కోచ్‌కు ప్రభుత్వం నుంచి సహాయం అందకపోవడంతో గ్రామస్తులు సైతం విచారం వ్యక్తం చేస్తు న్నారు. పైగా తెలంగాణ ఉద్యమంలో భిక్షపతి క్రియాశీ లకంగా పాల్గొన్నాడు. అలాంటి ఆయనను చూసుకునేం దుకు ఎవరూ లేక తాత్కాలికంగా శిష్యుని ఇంట్లో తల దాచుకొని పూటగడుపుతున్నాడు. ప్రస్తుతం తాను భిక్షాటన చేసే పరిస్థితి ఏర్పడిందని ఆత్మాభిమానం అడ్డువచ్చి ఆగా నని బోరుమని విలపిస్తూ భిక్షపతి చెబుతుండడం ఆయన దయనీయ స్థితికి అద్దం పడుతోంది. తనకు ప్రతీనెల మందులను అందజేసి తనను వృద్ధాశ్రమంలో చేర్పించాలని భిక్షపతి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు సహాయం చేసే వారు తనను చేరదీసిన శిష్యుడు గంజి రాంమోహన్‌రెడ్డి సెల్ నెంబర్ 97052 69535లో సంప్రదించాలని కోరారు. ఎవరైనా దయార్థహృదయులు, క్రీడాభిమానులు స్పందించి ఇనుగుర్తి ఐవోబీలోని ఐఎఫ్ఎస్‌సీ : ఐవోబీఏ0000920లోని తన ఖాతా నెంబర్ 092001000002553కు ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఇనుగుర్తిలోని తన ఇంట్లో వాలీబాల్ మాజీ కోచ్ భిక్షపతికి భోజనం పెడుతున్న శిష్యుడు రాంమోహన్‌రెడ్డి



వితంతువులకు జనవికాస ఆర్థిక సహాయం

కాజీపేట, సెప్టెంబరు 29: కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం వితంతువులకు, వారి పిల్లలకు జనవికాస ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. జనవికాస అధ్యక్షుడు లూర్థు మార్రెడ్డి హాజరై 80 మంది వితంతువులకు, 184 మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు, నిత్యావసర వస్తువులు, బుక్స్ కిట్లను అందజేశారు. వితంతువులకు జనవికాస తోడుంటుందని చెప్పారు. సహాయానికి సహకరించిన సోపార్ కెనడా దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం మహిళా పదక ప్రోగ్రాం మేనేజర్ లత మాట్లాడారు. పిల్లలు మంచి చదువులు చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి పధక సభ్యులు జ్యోతి, సుజన, అమూల్య తదితరులు పాల్గొన్నారు.



గాయమెరుగని సముద్రం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పది కాలాల పాటు నిలిచి ఉండేదే కవిత్వం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 29: పది కాలాల పాటు నిలిచి ఉండేదే కవిత్వమని సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజ మనోహర్‌బాబు అన్నారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో దేవగిరి పట్నం పరివార్, డీఎన్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో గన్నోజు ప్రసాద్ రాసిన గాయమెరుగని సముద్రం పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. జాతీయ సాహిత్యపరిషత్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్య అతిథి గిరిజ మనోహర్ బాబుతో పాటు విశిష్ఠ అతిథి దొడ్డ ప్రతాపరెడ్డి, డీఎన్ఆర్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, చక్రవర్తుల రాధాకృష్ణా మాట్లాడారు. సమాజ శ్రేయస్సును కాంక్షించే గొప్పతనాన్ని ప్రసాద్ తన కవితా రూపంలో చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్తలు బిల్లా మహేందర్, మడత భాస్కర్, తండా హరీష్‌గౌడ్ పాల్గొన్నారు. గన్నోజు ప్రసాద్ రాసిన ఈ పుస్తకాన్ని ఆయన తల్లిదండ్రులు గన్నోజు వీరమ్మ- రాజశేఖరంలకు అంకితం చేశారు.

పీఎస్ హెచ్‌ఎంల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న పీఎస్ హెచ్‌ఎంల నూతన కార్యవర్గం సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29: హనుమకొండ జిల్లా ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్ల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం హనుమకొండలోని ఆదర్శ న్యాయ కళాశాలలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా దేశిని లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా బి.శ్రీధరస్వామి, కోశాధికారిగా ఇ.వేణుగోపాలస్వామి, ఉపాధ్యక్షులుగా ఐ.వేదాంతాచారి, జి.సునంద, సంయుక్త కార్యదర్శులుగా టి. వీరస్వామి, భిక్షపతి, ఎం.రత్నకుమారి, రాష్ట్ర కౌన్సిలర్లుగా మంత్రి శ్రీనివాస్, బి.శరత్‌గౌడ్, ఎ.మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా టి.హన్యానాయక్, గౌరవాధ్యక్షుడిగా బి.మార్కండేయ, ముఖ్య సలహాదారులుగా ఎ.మల్లారెడ్డి, జి.ఉప్పలయ్య ఎన్నికయ్యారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

బాలసముద్రం, సెప్టెంబరు 29: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యాదర్శి ఇంద్రసేన అన్నారు. ఆదివారం బాలసముద్రంలోని ఏకశిల పార్కులో తెలంగాణ రైతాంగ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రసేనా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులకు రాత పూర్వకంగా హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను చట్టం తీసుకరావాలని రుణ విమోచన చట్టం, 2022 అటవీ సంరక్షణ నియమాలను రద్దు చేస్తూ 2006 అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును రద్దుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి రాజేందర్, జిల్లా నాయకులు మేకల గణేశ్, మండల యుగేందర్, కొడేపాక బాబు, అంబేద్కర్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఘనంగా ప్రపంచ గుండె దినోత్సవం

న్యూశాయంపేట, సెప్టెంబరు 29 : ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. వరల్డ్ హార్ట్ డేసందర్భంగా హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ కడియం కావ్య మాట్లాడారు. మన జీవన శైలిలో వచ్చిన మార్పుల కారణంగా వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత వ్యాధులతో చాలా మంది బాధపడుతున్నారన్నారు. ఒకప్పుడు 50 నుంచి 60 ఏళ్లపైబడిన వారిలోనే హార్ట్ ఎటాక్‌లు వచ్చేవని కానీ ఇప్పుడు స్కూల్ విద్యార్థులకు కూడా హార్ట్ ఎటాక్‌లు వస్తున్నాయని, దీనికి కారణం ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడికి గురి కావడం వంటివి ప్రధాన కారణమన్నారు. అంతకు ముందు మెడికవర్ హాస్పిటల్‌లో వరంగల్‌లోనే మొదటిసారి గుండెకు సంబంధించిన అధునాతన ఇంట్రా విజువల్ అల్ట్రా సౌండ్ పరికరాన్ని ఎంపీ కావ్య ప్రారంభించారు. సమావేశంలో మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం నమ్రత, డాక్టర్ సృజన్, డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి

వరంగల్ మెడికల్: కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో ఉన్న పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ప్రపంచ గుండె దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ముఖ్య అతిథులుగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ సీహెచ్.మురళి హాజరయ్యారు. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ మమ తారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. గుండె ఆరోగ్యంపై అవగాహన అవసరమని, ప్రస్తుత కాలంలో వృద్ధులే కాకుండా గుండె జబ్బుల ప్రమాదం వేగంగా యువతలో కూడా పెరుగుతోం దన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చన్నారు. వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమ ప్రతీరోజు చేయాలని సూచించారు. ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం లాంటివి చేయాలన్నారు. వీటితో పాటు పోషక ఆహారం తీసుకోవాల న్నా రు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ సృజన్, డాక్టర్ రితీష్, ఆర్ఎంవో డాక్టర్ రోషన్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండె వైద్య నిపుణులకు సత్కారం

వరంగల్ ఎడ్యుకేషన్ : అంతర్జాతీయ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకొని తనిష్క్ జువెల్లర్స్ ఆధ్వర్యంలో గుండె వైద్య నిపుణులను వైద్యులను సత్కరించారు. ఆదివారం హనుమకొండలోని తనిష్క్ జువెల్లర్స్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు యశోద నారాయణరావు, గంగిశెట్టి పరిపూర్ణ హరినాథ్‌లు డాక్టర్ ఆశాదీప్తి, డాక్టర్ లావణ్య, డాక్టర్ సనత్‌కుమార్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడారంగానికి సర్కారు పెద్దపీట

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 29: క్రీడా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కియో జపాన్ షోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ -2024 పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్యార్థులకు కరాటే విద్యా చాలా ఉపయుక్తమని అన్నారు. కరాటే విద్య నేర్చుకోవడం వలన పిల్లలు ప్రధానంగా బాలికలు, మహిళలు ఆత్మ రక్షణతోపాటు మానసిక, శారీరకంగా అభివృద్ధి చెందుతారని స్పష్టం చేశారు. విద్యార్థులు కరాటే విద్య నేర్చుకోవడానికి తల్లిదండ్రులు, ప్రైవేటుస్కూల్ యాజమాన్యాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో కియో రిఫరీ కమిషన్ ఛైర్మన్ ఎం.డి. జహంగీర్, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఐ.రామ్మోహన్ రెడ్డి, మేధా కాన్సెప్ట్ స్కూల్ డైరెక్టర్ మధూకర్‌రెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్లు ఎం.డి. సలీమ్, సునిల్, నన్నపనేని భరత్‌కుమార్, విశ్వనాథ్, అన్వర్, మంద విజేందర్, నాగ మహేష్, రచ్చ శ్రీనివాస్, పాపయ్య, సంపత్‌తో పాటు కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ బెల్టులు సాధించిన విద్యార్థులకు మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 58, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నంచదర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరాబు రాజేశ్వర్‌రావు, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి రవీందర్ (జేకే), తాళ్లపెల్లి మేరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 29: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని బాసిత్‌నగర్ ఎస్టీ హాస్టల్ ఏరియాలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మోక్ష విల్లాస్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

● హసన్‌పర్తి : మండల పరిధిలోని 11కేవీ లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఎన్పీడీసీఎల్ హసన్‌పర్తి ఏడీఈ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధి దేవన్నపేట, అలియాతండా, మధు తండా, దేవన్నపేట తండాలతో పాటు సుబ్బయ్యపల్లి వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయానికి ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏడీఈ అశోక్ తెలిపారు.

సమస్యను పరిష్కరించాలి

కాజీపేట, సెప్టెంబరు 29: కాజీపేట రహ్మత్‌నగర్ ఎఫ్‌సీఐ సమీపంలోని మురుగునీటితో స్థానికులు డెంగీ జ్వరాల బారిన పడుతున్నారని మునిసిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. కాజీపేట రహ్మత్‌నగర్ మురుగునీటి కుంటను ఆదివారం సీపీఐ బృందం సందర్శించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు, మునిసిపల్ అధికారులు సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, శంకర్ నాయక్, బొట్టు భిక్షపతి, పూర్ణచందర్, మంద సుమన్ పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి రక్షించండి

హసన్‌పర్తి, సెప్టెంబరు 29: కబ్జాదారుల నుంచి కాలనీవాసులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం నారాయణ నగర్ కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పోతరాజు రాజేందర్ తెలిపారు. హసన్‌పర్తి నారాయణ నగర్ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నారాయణ నగర్ కాలనీలో 186 సర్వే నెంబర్‌లోని 30 ఫీట్ల రహదారిని కొంత మంది దారికి అడ్డంగా ఖనీలను నాటి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాలనీవాసులు ఆవే దన వ్యక్తం చేశారు. రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వారి పై చర్యలు తీసుకొని ప్రాణరక్షణ కల్పించాలని బాధితులు కోరారు.

ఎమ్మెల్యే మాటల వక్రీకరణ సరికాదు

ఐనవోలు, సెప్టెంబరు 29: ఎమ్మెల్యే నాగరాజు మాటలను ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు వక్రీకరించడం సరికాదని కాంగ్రెస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాకర సాంబయ్య, మహిళా మండల అధ్యక్షురాలు అన్నారు. ఆదివారం ఐనవోలులో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి మాల కులస్థులే ఓట్లు వేశారని మాదిగలు వేయలేదనడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గంలో సబ్బండ ప్రజల కోసం చేస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ కల్పన మధుకర్, మాజీ సర్పంచ్ మంజుల యాదగిరి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ఏ అశోక్, నాయకులు తరుణ్, జగన్, ఆనందం, రాములు, స్వామి పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్స్ వార్షికోత్సవం

మడికొండ, సెప్టెంబరు 29: గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ తరాలపల్లిలో ఆదివారం ఆల్ ఇండియా రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ 11వ వార్షిక సమావేశం డి.మల్లేశం అధ్యక్షన జరిగింది. డివిజనల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని పెన్షనర్లు తమకు ఏవైనా సమస్యలుంటేప బ్రాంచ్ ద్వారా పంపించినట్లయితే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ సహాయ కార్యదర్శి సీహెచ్. కొమ్మాలు, జోనల్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె. యాదవరెడ్డి, డివిజనల్ కోశాధికారి డి. రాజేశ్వర్, కాజీపేట బ్రాంచి కార్యదర్శి కె.వి.రావు, ఉపాధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచి పుల్యాల యాదవరెడ్డి, బ్రాంచ్ కార్యదర్శి కొండయ్య, ఉపాధ్యక్షులు కట్టమల్లు, కొమురుమల్లు, ఎ.రవీందర్, ఎర్ర వెంకటయ్య, కోశాధికారి ఎ.చంద్రమౌళి, సారయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



చైతన్య (ఫైల్)

కాజీపేట, సెప్టెంబరు 29: భర్తతో గొడవ పడి మహిళ అదృశ్యమైంది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మడికొండకు చెందిన ఎం.వేణుకు కాజీపేట సోమిడికి చెందిన కనుకరాజు కుమార్తె చైతన్యతో 17 ఏళ్ల కిందట వివాహమైంది. నిత్యం మొబైల్‌లో సమయం వృథా చేస్తున్నావని భార్యను భర్త వేణు మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య జరిగిన గొడవతో వేణు తన భార్యను ఇటీవల పుట్టింట్లో వదిలి వెళ్లాడు. మరుసటి రోజు వేణు కుమా రుడు అమ్మమ్మకు ఫోన్ చేయగా తల్లి చైతన్య ఇంట్లో లేదని చెప్పింది. దీంతో ఆమె గురించి కుటుంబ సభ్యుల వద్ద వెతికి కాజీ పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తప్పిపోయిన మహిళ వయస్సు 38 ఏళ్లు ఉంటుంది. ఛామనఛాయ రంగు, ఎత్తు 5 ఫీ ట్లు, ఎడమ చెంపపై పుట్టుమచ్చ ఉంటుంది. ఇంట్లో నుంచి వెళ్లేట ప్పుడు పసుపుపచ్చ చీర ధరించి ఉందనీ, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.

రైల్వే టౌన్ స్టేషన్ వద్ద మెగా బ్లాక్

కాజీపేట, సెప్టెంబరు 29: కాజీపేట టౌన్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రైల్వే అధికారులు మెగా బ్లాక్ తీసుకుని మూడోరైల్వే లైన్ పనులు చేపట్టారు. 14 గంటలు ఏకధాటిగా 500 మందితో ఈ పనులు చేపట్టారు. దీంతో రైల్వే కార్మికులు ట్రాక్ పనులు చేస్తుండగా ఓ జాతర వాతావరణం నెలకొంది. ఈ బ్లాక్ పనుల్లో అన్నివింగ్‌ల రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ కమిటీ ఎన్నిక

మడికొండ, సెప్టెంబరు 29: మడికొండలోని మణికంఠ గ్రీన్ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌ల యజమానులు సమావేశమై నూతన కమిటీని బిల్డర్ అశోక్, అనుదీప్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రమేష్‌రెడ్డి, కార్యదర్శులుగా వై.వేణుగోపాల్, వై.క్రిష్ణ, కోశాధికారిగా ఎం. సోమేశ్వర్‌రావు, గౌరవ సభ్యులుగా బి.కార్తీక్, జి.సోమేశ్వర్, టి.శ్రీనివాస్, వీవీఎస్ఆర్‌పి శర్మ, బి.నారాయణబాబు, సీహెచ్. వెంకటేష్, ఎం.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను అపార్ట్‌మెంట్‌వాసులతో పాటు బిల్డర్స్ ఘనంగా సన్మానించారు.

అంబేడ్కర్ భావజాలాన్ని విస్తరించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 29: అంబేడ్కర్ భావజాలాన్ని విస్తరించాలని రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. ఐలయ్య అన్నారు. ఆ సంఘం 48వ వార్షికోత్సవాన్ని ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభమైన ర్యాలీ హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంకు చేరుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఐలయ్య మాట్లాడారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆవిర్భావం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలపై నిరంతర సమరశీల పోరాటం చేస్తూ బాధితులకు బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు మిద్దెపాక ఎల్లయ్య, బొమ్మల్ల అంబేడ్కర్, రౌతు రమేష్, ఏనుట్ల రవీందర్, కాంతారావు, దుర్గాప్రసాద్, కొమురెల్లి, నక్క భిక్షపతి తదితరులు పాల్గొని మాట్లాడారు.

ప్రిన్సిపాల్ సుదర్శన్‌కు అవార్డు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 29: కేయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, వర్సిటీ పాలక మండలి సభ్యుడు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషన్ డిస్ట్రిక్టు 320ఎఫ్ 2024-25 ఏడాదికి ఉత్తమ అధ్యాపక అవార్డును పొందారు. ఆదివారం శాయంపేటలోని పీఆర్‌జీ గార్డెన్‌లో లయన్స్ ప్రోగ్రామ్ ఛైర్మన్ కటంగూరు రాంగోపాల్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ బొమ్మినేని నర్సింహారెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి, లయన్స్ థౌసండ్ పిల్లర్స్ ప్రెసిడెంట్ చొప్పరి సోమయ్య, డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, లయన్స్ టి.లక్ష్మి నర్సింహరావు, ఎ.రవీందర్, జర్నలిస్టు వేణుమాధవ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగరాణి, డాక్టర్ నిమ్మ సుదర్శన్‌ను సమావేశంలో పాల్గొని అభినందించారు.

ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలి

ఐనవోలు, సెప్టెంబరు 29: ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. వెంకటాపురంలో సీపీఎం గ్రామ మహాసభ సలీంరాజు భవనంలో ఆదివారం కార్యదర్శి ఉప్పలయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న రైతు ప్రజావ్యతిరేక విధానాల వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశసంపదను కొల్లగొడుతూ పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని మండిపడ్డారు. రైతులకు మద్దతు ధర కల్పిస్తామని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. నిరుద్యోగం, పెదరికం విపరీతంగా పెరిగిందని వీటిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ రుణమాఫీ 60 శాతానికి మించి జరుగలేదన్నారు. మిగిలిన 40 శాతం రుణమాఫీపై కుంటి సాకులు చెప్పుతున్నారే తప్ప ఎప్పుడు అమలు చేస్తారో చెప్పడం లేదన్నారు. కొత్త రేషన్‌కార్డులు, పించన్లు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. మహాసభ ప్రారంభం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా దీకొండ ఉప్పలయ్య, మాదాసి పోచమ్మ, సహాయ కార్యదర్శి కె. నారాయణరెడ్డి, సరోజనలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, నాయకులు యాకుబు, దర్శనాల సంపత్, బి. యాకయ్య, కవిత, మణెమ్మ, రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శుల నియామకం

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 29: భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శులుగా హనుమకొండ నగరానికి చెందిన దొంతుల వాసుదేవారెడ్డి, నగునూరి నిర్మలను జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి నియమించినట్లు బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి చల్లా జైపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందన్నారు.

గెజిటెడ్ హెచ్‌ఎంల కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన జిల్లా గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం కార్యవర్గ సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29: హనుమకొండ జిల్లా గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీ స్కూల్లో తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్, కోశాధికారి తుకారాం ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సరస్వతీభట్ల రామకృష్ణ, ప్రధానకార్యదర్శిగా గుగులోతు నెహ్రూ, ఆర్థిక కార్యదర్శిగా బీరం సంధ్యారాణి, రాష్ట్ర కౌన్సిలర్‌గా కొల్లూరి వెంకన్న, వేణుఆనందలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వర్గీకరణపై ఎమ్మెల్యే నాగరాజు స్పష్టత ఇవ్వాలి

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల డిమాండ్

ఐనవోలు, సెప్టెంబరు 29: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎస్సీ వర్గీకరణకు అనుకూలమా, వ్యతిరేకమా అనే స్పష్టత ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్‌మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి బొక్కల నారాయణ మాదిగలు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత అశోక్ అధ్యక్షతన ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గంలో మాదిగలు తనకు ఎవరు ఓటువేయలేదని మాలలు మాత్రమే వేశారని చులకనగా మాట్లాడారన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నెల జీతం రూ.2.70 లక్షలను కోర్టు ఖర్చులకు ఇచ్చానని ఎమ్మెల్యే చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి అన్ని కులాలు, అన్ని మతాలు సమానమే అని అన్ని వర్గాల వారిని సమానంగా చూస్తానని రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఎమ్మెల్యే ఒక మాలకులానికి వత్తాసు పలకడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. తక్షణమే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాదిగలకు క్షమాపణలు చెప్పి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. ఎమ్మెల్యే తీరును ప్రజాస్వామ్య వాదులు, అన్ని సంఘాలు, పార్టీల్లో ఉన్న మాదిగలు వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బరిగెల వెంకటస్వామి మాదిగ, చంద్రమౌళి, కటుకూరి రమేష్, స్వామి, చేరాలు, భాస్కర్, రమేష్, బాబు, ఐలయ్య, ప్రవీణ్, కుమార్‌మాదిగలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మడికొండ, సెప్టెంబరు 29: 150 మంది పూర్వ విద్యార్థులు 29 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకున్న అపూర్వ సన్నివేశం ఆదివారం మడికొండలో ఆవిష్కృతమైంది. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. తొలుత మృతి చెందిన సహచర విద్యార్థులకు నివాళులర్పించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు. ఒకరినొకరు కలుసుకొని చిన్ననాటి చిలిపి చేష్టలు, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత జీవితానుభవాలను పంచుకున్నారు. అందరూ కలిసి ఆటపాటలతో గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. మధుర స్మృతులను మదినిండా నింపుకొని ఇళ్లకు చేరుకున్నారు.



మడికొండలోని ఫంక్షన్ హాల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు



WANTED
★ నారాయణ ఖేడ్‌లో ఇంటి నెంబరు ప్లేట్లు కొట్టుటకు వర్కర్లు కావలెను. డైలీ పేమెంట్స్. సం॥ప్ర॥ 8008825470.
AJW-188297

WANTED
★ మా ఆఫీస్‌లో పని చేయుటకు Telecallers, Receptionist, Management, Marketing Supervisor Office Boy, స్త్రీ మరియు పురుషులు కావలెను. సం॥ప్ర॥ 9491710857, 7382323126
AJW-199322

WANTED
★ హన్మకొండ బాలసముద్రం లోని స్టాంప్‌వెండర్ దగ్గర పని చేయుటకు D.T.P తెలుగు English వర్క్ వచ్చిన వారు కావలెను. సం॥ప్ర॥ 9492108755, 8500888901
AJW-199324

సెక్యూరిటి గార్డ్స్ కావలెను
★ WGL, HNK నందు గల SHOW ROOMS, HOSPITAL అపార్ట్‌మెంట్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. జీతం : 10,000/- to 12,000/- + ESI, EPF సం॥ప్ర॥ 8978459111, 6309922608
AJW-0431

R.K.మ్యారేజ్ బ్యూరో
★ Reg.No: 422/2018. S/w.B.Tech, M.Tech, M.B.A., P.G., Dr.Govt/Pvt, N.R.I, లో ఉద్యోగం చేయు పద్మశాలి అమ్మాయి, అబ్బాయిలకు అర్జెంటుగా పెళ్లి సంబంధాలు చూస్తాము. ఆఫీస్ HYD & WGL. Cell.No. 9347756380
AJM-199352

PLOTS FOR SALE
★ శ్రీశైలం హైవే ఫార్మాసిటీ ఫ్యూచర్ సిటీ దగ్గరలో DTCP అప్రూవుడ్ ప్లాట్స్ అమ్మబడును. గజం 8459/- మాత్రమే. సం॥ప్ర॥ 8074634557
AJW-199327

PLOTS FOR SALE
★ వరంగల్ హైవేపై కమర్షియల్ ప్లాట్స్ DTCP అప్రూవుడ్ ప్లాట్స్ అమ్మబడును. ఆలేర్, పెంబర్తి దగ్గర. గజం : 16500/- మాత్రమే. సం॥ప్ర॥ 8074634557
AJW-199328

HOUSE FOR SALE
★ కొత్తూరు లో 72 గజాలు 3 రేకుల రూంలు, ఇంటి నెంబరు, నల్ల గల ఇల్లు ఇరవై ఒక్క లక్షలకు, మరియు 37 గజాల కింద, పైన ఒకొక్క రూం కొత్తగా నిర్మించినది కేవలం 22 లక్షలకు అమ్మబడును. నో బ్రోకర్ సం॥ప్ర॥ 9182538110.
AJW-7618

FOR SALE
★ Shop : GENTS Cloth Stores for Sale Near Hanamkonda Chowrastha Cont: 9381320769
AJW-199319

TO-LET
★ REC పెట్రోల్ పంప్ (తారా గార్డెన్ ఎదురుగా) మెయిన్‌రోడ్‌లో 1780 చ॥అ॥ విస్తీర్ణములో గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మరియు 3000 చ॥అ॥ విస్తీర్ణములో గల వర్క్‌షాప్ పూర్తి కవరేజ్ షెడ్‌తో టూ వీలర్స్, ఫోర్ వీలర్స్, షోరూంలకు, బ్యాంకులకు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయములకు కిరాయికు ఇవ్వబడును. సం॥ప్ర॥ 9704445770, 8897678810
AJW-199216

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే.
అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.



ఆంధ్రజ్యోతి HANUMAKONDA RURAL సోమవారం 30 సెప్టెంబరు 2024

హనుమకొండ రూరల్

• పరకాల • నడికూడ • ఆత్మకూరు • దామెర • శాయంపేట • ఎల్కతుర్తి • భీమదేవరపల్లి • కమలాపూర్

రైతు హామీల సాధన దీక్షను విజయవంతం చేయాలి

దామెర, సెప్టెంబరు 29: రాష్ట్రంలో రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా చేపడుతున్న రైతు హామీల సాధన దీక్షను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి తమ ప్రకటనలో వెల్లడించారు. ఇందులో భాగంగా ఈ నెల 30న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న దీక్షకు పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులు తరలి రావాలని కోరారు. తెలంగాణాలోని రైతులకు ఇచ్చిన హామీలను పక్కన బెట్టి, రైతులను పలు ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులకు మద్దతుగా రాష్ట్రంలో బీజేపీ ప్రజా ప్రతినిధులంతా భారీ సంఖ్యలో హాజరై, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. రైతుల పక్షాన నిలబడి, రైతులకిచ్చిన హామీలను సాధిద్దామని పిలుపునిచ్చారు.

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ బహూకరణ

భీమదేవరపల్లి, సెప్టెంబరు 29 : భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు జాన ఆగయ్య మృతి చెందగా, ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆదివారం ఫ్రీజర్‌ను బహూకరించారు. ఆదివారం ఆగయ్య మొదటి వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు గ్రామపంచాయతీ కార్యదర్శి సరిత, మాజీ సర్పంచ్ వంగ సురేష్, మాజీ వార్డు సభ్యుడు గుండెల్లి సదానం దంయాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కడార్ల మహేందర్‌కు ఫ్రీజర్‌ను అందించారు. ఫ్రీజర్‌ను అందించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆగయ్య కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో ఆగయ్య కుమారులు జాన రమేష్, జాన ప్రవీణ్, కూతురు వడ్డీ శారద, కుటుంబ సభ్యులు శ్యామల, రమ, దివ్య భారతి, భరత్, భగత్‌తేజ, అనూష, అర్చన, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అపూర్వ సమ్మేళనం



సమ్మేళన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు

శాయంపేట, సెప్టెంబరు 29 : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో 1972-77 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో కలుసుకున్నారు. ఈ క్రమంలో అమరులైన తమతో చదువుకున్న మిత్రులు, బోధించిన ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. అనంతరం పరిచయాలు చేసుకుని, చదువుకున్న నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

దామెర, సెప్టెంబరు 29 : బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి గంకిడి బుచ్చిరెడ్డి తెలిపారు. దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు మన్నెం రవీందర్‌రెడ్డి అకాల మృతి చెందగా ఆదివారం సంవత్సరీకం క్రతువు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంకిడి బుచ్చిరెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చిత్ర పటం వద్ద పూలు చల్లి నివాళులర్పించి, తామున్నామంటూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దామెర మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు బిల్లా రమణారెడ్డి, సదయ్య, రాజు పాల్గొన్నారు.

వ్యవసాయ భూమిని దున్నిన వారిపై కేసు

దామెర, సెప్టెంబరు 29 : వ్యవసాయ భూమిలో అక్రమంగా ఎక్స్‌కవేటర్‌తో దున్నిన(చదును చేయడం) వారిపై కేసు నమోదు చేసిన ఘటన దామెర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దామెర ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన చిలువేరు భిక్షపతికి ఇదే గ్రామానికి చెందిన బండారి సుజాతల మధ్య గత కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తలెత్తిన భూవివాదంలో చిలువేరు భిక్షపతికి చెందిన వ్యవసాయ భూమిలో సదరు బండారి సుజాత, బండారి అఖిల, కుమార్‌లు ఎక్స్‌కవేటర్‌తో చదును చేయిస్తున్నారు. ఈ క్రమంలో తన భూమిలో అక్రమంగా చొరబడి ఎందుకు చదును చేయిస్తున్నారని అడిగాడు. ఈ నేపథ్యంలో భిక్షపతిని నానా బూతులు తిడుతూ చంపుతామని బెదిరించినట్లు పేర్కొన్నారు. దీంతో భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

చెత్త సేకరణపై చిత్తశుద్ధి ఏది ?

- పాత ఆటోలు అమ్మి కొత్తవి కొంటే మేలు
- మరో పది కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే ఆదేశం
- కిరాయితో అదనపు భారం
- నెలకు రూ. లక్షన్నర ఖర్చు మరమ్మతులకే..

పరకాల, సెప్టెంబరు 29: పరకాల మునిసిపల్ పరిధిలో చెత్త సేకరణ కు ఏర్పాటు చేసిన మినీ ఆటోల రిపేరు వస్తే చాలా ఇబ్బంది ఏర్పడు తుంది. ఒక రోజు తర్వాత మరుసటి రోజు చెత్త సేకరణకు వచ్చే వాహనా లు కనీసం నాలుగు రోజులు గడిచినా రాకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటి ఆవరణలో మిగిలిపోయినా చెత్తతో దుర్వాసన వెదజల్లడమే కాక ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. రిపేరులకు పెట్టే ఖర్చుతో కొత్త ఆటో కొనుగోలు చేసి ఈఎంఐ కట్టుకోవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పరకాల పట్టణంలో 45, 529 జనాభా ఉన్నారు. మునిసిపల్ పరిధిలో పది మినీ టాటా ఏస్ వాహనాలు, మూడు ట్రాక్టర్లు, ఒక స్వీపింగ్ మిషన్, ఒక వాటర్ ట్యాంక్ ఉన్నాయి. ఇందులో మూడు ట్రాక్టర్లు అద్దె తీసుకొని ప్రతి నెలా ట్రాక్టర్‌కు రూ. 45వేల చొప్పున నెలకు రూ. లక్షా 35వేలు అద్దె చెల్లిస్తున్నారు. కందకాలు తీయడానికి జేసీబీలను అద్దెకు తీసుకుంటున్నారు. డోర్ టు డోర్ తిరుగుతూ మూడు నుంచి ఐదు కిలో మీటర్లు డంపింగ్‌యార్డుకు వెళ్లి రావడం కోసం 300 నుంచి 400 మందికి ఒక ఆటో చొప్పున పట్టణానికి 22 వాహనాలు ఉండాలి.. కానీ పది వాహనాలతోనే చెత్తను సేకరిస్తున్నారు. ప్రస్తుతం మునిసిపల్ పరిధిలో 83 మంది సిబ్బంది ఉండగా ఇందులో 15 మంది డ్రైవర్లు, నలుగురు జవాన్లు, 35 మంది స్వీపర్లు మిగతావారు డ్రైక్లీనర్లు. వీరికి ప్రతినెలా రూ. 13 లక్షల 73 వేల జీతాలు



తుప్పు పట్టిన చెత్త సేకరణ మినీ ఆటో

చెల్లిస్తు న్నారు. ప్రతి నెల మునిసిపల్ కార్యాలయ సిబ్బందికి మెయింటనెన్స్‌కు రూ. 34 లక్షలు జీతాలు చెల్లించాల్సి ఉంది.

పాత ఆటోలు అమ్మి కొత్తవి కొంటే మేలు

మినీ టాటా ఏస్ వాహనాలు కొనుగోలు చేసి నాలుగు సంవత్సరాలు దాటింది. వీటికి రెండు సంవత్సరాల వరకే వారంటీ ఉంది. ప్రస్తుతం ఆటోల మరమ్మతుకు ప్రతి నెలా రూ. లక్షా 50వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఖర్చు వస్తుంది. ఆగస్టులో ఒకేసారి నాలుగు టాటా ఏస్‌లు రిపేరు నేటికి పూర్తి కాలేదు. సరైన వస్తువులు దొరకక రిపేరు కావడం లేదు. ఇం దు కోసం అదనంగా మూడు అద్దె ట్రాక్టర్లను తీసుకొని నడిపిస్తున్నారు. ప్రతి రోజు చెత్తను సేకరించక రోజు తప్పించి మరో రోజు వచ్చి చెత్తను సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇటీవల జరిగిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో చెత్త సేకరణపై మునిసిపల్‌కు మరో పది మినీ వాహనాలను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు దానిని అమలు పర్చలేదు. ఆటో అడుగు భాగాలకు తుప్పు పట్టి పోవడంతో ఇటీవల ఆరు వాహనాలకు రూ. 2 లక్షలు వెచ్చించి రిపేరు చేయించారు. పాత వాహనాలను కంపెనీలకు ఇచ్చి కొత్తవి తీసుకుంటే రిపేరు ఖర్చు తగ్గడంతో పాటు రెండు మూడేళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెత్త సేకరించవచ్చు. ప్రతినెలా డీజిల్ ఖర్చుల కోసం రూ. 2 లక్షల 90 వేలు ఖర్చు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజీ ఇచ్చే వాహ నాలు విద్యుత్‌తో నడిచే వాహనాలను కొనుగోలు చేస్తే మునిసిపల్‌కు ఖర్చు తగ్గించవచ్చని పట్టణవాసులు సూచిస్తున్నారు. సరైన నిర్ణయాలు తీసుకోకపోవడమే వల్లనే ఎక్కువ ఖర్చు వస్తుందని ప్రజలు పేర్కొం టున్నారు. ఇప్పటికైనా అధికారులు చెత్త సేకరణపై దృష్టి సారించి కొత్త వాహనాలు కొనుగోలు చేసి ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పాత వాహనాల వల్లే ఇబ్బందులు

నర్సింహా, మునిసిపల్ కమిషనర్



పాత వాహనాలతో చాలా ఇబ్బం దులతో పాటు ఖర్చు కూడా ఎక్కువగా వస్తుంది. కొత్త వాహనాల కొనుగోలు కోసం రెండు మూడు రోజుల్లో నిర్ణయం తీసుకొని కొనుగోలు చేస్తాం. ఒకేసారి నాలుగు ఆటో లు రిపేరుకు పోవడం వల్ల చెత్త సేకర ణలో ఇబ్బంది ఏర్పడింది. రెండు ఆటోలు రిపేరు చేయించి తీసుకొచ్చాం. అద్దెకు తీసుకున్న ట్రాక్టర్లను కూడా తొలగిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెత్త సేకరణపై దృష్టి పెడతాం.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

పాలక మండలి రైతులకు నిస్వార్థ సేవలు అందించాలి

ఎమ్మెల్యేలు రేవూరి, గండ్ర సత్యనారాయణరావు

మార్కెట్ కమిటీ పాలకవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ





మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు

పరకాల, సెప్టెంబరు 29 : నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ పాలకవర్గం అధికారులు, రైతులతో సమన్వయంతో ముందుకు సాగి రైతుల సమస్యలను పరిష్కరించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పరకాల ఆర్టీసీ డిపో నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ మా ర్కెట్ ఆవరణలో జరిగిన పదవీ బాధ్యతల కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన పాలక మండలి సభ్యులు విజయవంతంగా సేవలందించి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.

పరకాల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి త్వర లోనే వ్యవ సాయశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. పరకాల ప్రాంతం వ్యవసాయాధరిత ప్రాంతం అయి నందున రైతు సోదరులకు అన్ని రకాల వస తులు కల్పించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రైతుల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు.

మార్కెట్ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న గోదాములను పరిశీ లించి తిరిగి పు నః ప్రారంభించేలా చర్యలు తీసుకొని, వ్యవసాయ మార్కెట్‌కు కోల్డ్ స్టోరేజ్, వ్యవసాయ ఆధారిత ఫుడ్ ప్రాసె సింగ్ యూనిట్లను తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్య క్షుడు దొమ్మాటి సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారానికి తరలిన నాయకులు

శాయంపేట, సెప్టెంబరు 29: పరకాల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. మండల కేంద్రానికి చెందిన మారపెల్లి రవీందర్(బుజ్జన్న) వైస్ చైర్మన్‌గా, పత్తిపాకకు చెందిన వైద్యుల వెంకట రాజిరెడ్డి, గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన శానం కుమారస్వామి డైరెక్టర్లుగా నియామకం అయ్యారు. ఈ నేపథ్యంలో వారు స్థానిక నాయకులతో కలసి, వందలాది ద్విచక్రవాహనాలపై శాయంపేట నుంచి పరకాలకు ర్యాలీగా వెళ్లారు. ప్రమాణం స్వీకారమహోత్సవం అనంతరం కాంగ్రెస్ శ్రేణులు మండల కేంద్రంలో భారీగా బాణసంచా కాలుస్తూ సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం



మండలనాయకులతో కలిసి ప్రమాణ స్వీకారానికి తరలుతున్న వైస్ చైర్మన్ రవీందర్

రవి, దుబాసి క్రిష్ణమూర్తి, బాసని చంద్రప్రకాష్, మారపెల్లి కట్టయ్య, వైనాల కుమారస్వామి, రఘుపతిరెడ్డి, రాజేందర్, వరదరాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చలివాగు ప్రాజెక్టులో చేపలు పట్టకూడదు..

మత్స్యసొసైటీ చైర్మన్ హుకుం - తమ పొట్టకొట్టొద్దని మత్స్యకార్మికుల వేడుకోలు



మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న మత్స్యకారులు

శాయంపేట, సెప్టెంబరు 29: చలివాగు ప్రాజెక్టులో చేపలు పట్టకూడదని, కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని మత్స్యసొసైటీ చైర్మన్ గండి రాజమౌళి తమ పొట్టకొడుతున్నారని కార్మికులు రోడ్డెక్కారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రకం కట్టి ప్రాజెక్టులో చేపలు పట్టుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామని, చైర్మన్ గండి రాజమౌళి తన స్వార్థం కోసం పలుమార్లు ప్రాజెక్టును కాంట్రాక్టర్‌కు ఇస్తున్నామని చేపలు పట్టొద్దని బెదిరిస్తున్నారని అన్నారు. పలుమార్లు సమావేశాలు పెట్టి చేపలుపట్టని వారిని కలుపుకుని కాంట్రాక్టర్‌కు ఇస్తున్నామని అగ్రిమెంట్‌పై సంతకాలు చేయిస్తున్నారన్నారు. చేపలు పట్టకూడదని, పడితే సభ్యత్వాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై గతంలో స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే చైర్మన్‌కు చివాట్లు పెట్టినా మార్పులేదని అన్నారు. గత పదేళ్ల క్రితమే కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దుచేశారని, మళ్లీ కాంట్రాక్ట్ ఇస్తే తమ జీవనోపాధి కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలా జరిగితే తమకు చావే శరణ్యమని కన్నీరుమున్నీరయ్యారు. ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ పల్లెబోయిన భాస్కర్, కార్మికులు కరుణాకర్, పల్లెబోయిన రాజు, అల్లం కుమారస్వామి, కుక్కల రవీందర్, దశరథం, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడారంగానికి సర్కారు పెద్దపీట

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 29: క్రీడా రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కియో జపాన్ షోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్-2024 పోటీలను జ్యోతి ప్రజ్వ లన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్యా ర్థులకు కరాటే విద్యా చాలా ఉపయుక్తమని అన్నారు. కరాటే విద్య నేర్చుకోవడం వలన పిల్లలు ప్రధానంగా బాలికలు, మహిళలు ఆత్మ రక్షణతోపాటు మానసిక, శారీరకంగా అభివృద్ధి చెందుతారని స్పష్టం చేశారు. విద్యార్థులు కరాటే విద్య నేర్చుకోవడానికి తల్లిదండ్రులు, ప్రైవేటుస్కూల్ యాజమాన్యాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో కియో రిఫరీ కమిషన్ చైర్మన్ ఎం.డి. జహంగీర్, టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ ఐ.రామ్మోహన్ రెడ్డి, మేధా కాన్సెప్ట్ స్కూల్ డైరెక్టర్ మధూకర్‌రెడ్డి, సీనియర్ కరాటే మాస్టర్లు ఎం.డి. సలీమ్, సునిల్, నన్నపనేని భరత్‌కుమార్, విశ్వనాథ్, అన్వర్, మంద విజేందర్, నాగ మహేష్, రచ్చ శ్రీనివాస్, పాపయ్య, సంపత్‌తో పాటు కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ బెల్టులు సాధించిన విద్యార్థులకు మెడల్స్‌తోపాటు సర్టిఫికెట్లను



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 58, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధా కర్, ఎనుకొంటి పున్నంచదర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరాబు రాజేశ్వర్‌రావు, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి రవీందర్ (జేకే), తాళ్లపెల్లి మేరి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై గ్రామస్థుల ఆగ్రహం

నాసిరకంగా సీసీరోడ్డు పనులు చేస్తున్నారణ ఆరోపణ



సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 29: ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన ఆదివారం ఆత్మకూరు మండలం కేంద్రంలో జరిగింది.

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతులతోపాటు జాతీయ రహదారి నుంచి గేటు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆదివారం కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. ఈ రోడ్డు పనులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్, అధికారులు కుమ్మక్కై అధికారులు లేకున్నా కాంట్రాక్టర్ ఇంజనీరింగ్ అధికారిగా అవతారమెత్తి ఇష్టానుసారంగా రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. రోడ్డుపై మట్టిని తొలగించి, రోలింగ్ చేసి, కాంక్రీట్ వేయాల్సి ఉండగా నిబంధనలు తుంగలో తొక్కి మట్టిపై రోలింగ్ చేయకుండానే కాంక్రీట్ వేస్తున్నారని ఆరోపించారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేసి, ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విష యంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ స్పందనను సంప్రదించగా రూ.30 లక్షలు మంజూరయ్యాయని, ఇంజనీరింగ్ అధికారులు ఉండి పనిచేయించాలని చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, పీఆర్ ఏఈని వివరణ అడగడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

నేడు ఒగ్లాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

దామెర, సెప్టెంబరు 29: దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు దామెర పీహెచ్‌సీ వైద్యాధికారులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఒగ్లాపూర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. గ్రామంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య

పరకాల, సెప్టెంబరు 29 : పరకాల పట్టణ 8వ వార్డు విలీన గ్రామం సీతారాంపురం కాంగ్రెస్ పార్టీ నాయకుడు బుర్ర రాజమౌళి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య ఆదివారం రాజమౌళిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లడే శ్రీకాంత్, జంగిలి సతీష్, పైండ్ల రమేష్, మునుకుంట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రత మోదీతోనే సాధ్యం

భూపాలపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్ రెడ్డి



మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నిశిధర్ రెడ్డి

శాయంపేట, సెప్టెంబరు 29: భారత దేశాన్ని భద్రంగా చూస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ప్రతి ఒక్కరు మద్దతు తెలపాలని భూపాలపల్లి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎడునూతన నిశిధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సభ్యత్వ నమో దు కార్యక్రమంలో మండల కేంద్రంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. అవిశ్రాంతంగా పనిచేస్తూ ప్రపంచంలోనే భారత దేశాన్ని అగ్రగామిగా నిలప డానికి మోదీ కృషి చేస్తున్నారని కొనియాడారు. కొన్ని సంఘ విద్రోహ శక్తులు దేశా న్ని ముక్కలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. అనంతరం మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. మండల అధ్యక్షుడు గడ్డం రమేష్, ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామక్రిష్ణ, రాకేష్ రెడ్డి, నవీన్, శేఖర్, సాంబయ్య, సుధాకర్, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

శాయంపేట, సెప్టెంబరు 29 : గుడుంబా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి, 30 లీటర్ల గుడుంబాను స్వాధీన పరుచుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ ఆదివారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తిపాకలో రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై 30 లీటర్ల గుడుంబా రవాణా చేస్తున్న బాబు శివతిరుపతి అనే వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేసి, వాహనం, గుడుంబా స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఈ రూట్‌వాచ్‌లో ఎస్ఐ జ్యోతి, కానిస్టేబుల్స్ అఖిల్, దిలీప్ పాల్గొన్నారు.



WANTED
★ నారాయణ ఖేడ్‌లో ఇంటి నెంబరు ఫ్లేట్లు కొట్టుటకు వర్కర్లు కావలెను. డైలీ పేమెంట్స్. సం॥ప్ర॥ 8008825470.
AJW-188297

WANTED
★ మా ఆఫీస్‌లో పని చేయుటకు Telecallers, Receptionist, Management, Marketing Supervisor Office Boy, స్త్రీ మరియు పురుషులు కావలెను. సం॥ప్ర॥ 9491710857, 7382323126
AJW-199322

WANTED
★ హన్మకొండ బాలసముద్రం లోని స్టాంప్‌వెండర్ దగ్గర పని చేయుటకు D.T.P తెలుగు English వర్క్ వచ్చిన వారు కావలెను. సం॥ప్ర॥ 9492108755, 8500888901
AJW-199324

సెక్యూరిటి గార్డ్స్ కావలెను
★ WGL, HNK నందు గల SHOW ROOMS, HOSPITAL అపార్ట్‌మెంట్స్ నందు సెక్యూరిటి గార్డ్స్ వెంటనే కావలెను. జీతం : 10,000/- to 12,000/- + ESI, EPF సం॥ప్ర॥ 8978459111, 6309922608
AJW-0431

R.K.మ్యారేజ్ బ్యూరో
★ Reg.No: 422/2018. S/w. B.Tech, M.Tech, M.B.A., P.G., Dr.Govt/Pvt, N.R.I, లో ఉద్యోగం చేయు వధువులకు అమ్మాయి, అబ్బాయిలకు అర్జెంటుగా పెళ్లి సంబంధాలు చూస్తాము. ఆఫీస్ HYD & WGL. Cell.No. 9347756380
AJM-199352

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013 8978510273
వరంగల్ 9985406150 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

PLOTS FOR SALE
★ శ్రీశైలం హైవే ఫార్మాసిటి ఫ్యూచర్ సిటి దగ్గరలో DTCP అప్రూవుడ్ ప్లాట్స్ అమ్మబడును. గజం 8459/- మాత్రమే. సం॥ప్ర॥ 8074634557
AJW-199327

PLOTS FOR SALE
★ వరంగల్ హైవేపై కమర్షియల్ ప్లాట్స్ DTCP అప్రూవుడ్ ప్లాట్స్ అమ్మబడును. ఆలేర్, పెంబర్తి దగ్గర. గజం : 16500/- మాత్రమే. సం॥ప్ర॥ 8074634557
AJW-199328

HOUSE FOR SALE
★ కొత్తూరు లో 72 గజాలు 3 రేకుల రూంలు, ఇంటి నెంబరు, నల్ల గల బిల్లు ఇంటిపై ఒక్క లక్ష లక్ష, మరియు 37 గజాలు కింద, పైన ఒకొక్క రూం కొత్తగా నిర్మించినది కేవలం 22 లక్షలకు అమ్మబడును. నో బ్రోకర్ సం॥ప్ర॥ 9182538110.
AJW-7618

FOR SALE
★ Shop : GENTS Cloth Stores for Sale Near Hanamkonda Chowrastha Cont: 9381320769
AJW-199319

TO-LET
★ REC పెట్రోల్ పంప్ (తారా గార్డెన్ ఎదురుగా) మెయిన్‌రోడ్‌లో 1780 చ॥అ॥ విస్తీర్ణములో గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ మరియు 3000 చ॥అ॥ విస్తీర్ణములో గల వర్క్‌షాప్ పూర్తి కవరేజ్ షెడ్‌తో టూ వీలర్స్, ఫోర్ వీలర్స్, షోరూంలకు, బ్యాంకులకు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయములకు కిరాయికు ఇవ్వబడును. సం॥ప్ర॥ 9704445770, 8897678810
AJW-199216

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా పంపించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతి ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.